

'వెదజల్లు'తో ప్రయోజనాలెన్నో

వరిలో వెదజల్లు, డ్రమ్‌సీడ్ పద్ధతిలో సాగు చేస్తూ పెట్టుబడులు తగ్గించుకుంటూ వ్యవసాయం దండగ కాదు పండగ అని నిరూపిస్తున్నారు కొందరు రైతులు. 10లో ▸



ఆషాఢ సారె

భీమవరంలో శ్రీబాలా త్రిపుర సుందరీదేవి అమ్మవారికి భక్తులు ఆషాఢ సారె అందించారు. 108 రకాల స్వీట్లు, పండ్లు, పూలు సారెగా సమర్పించారు. 10లో ▸



ప్రమాదాలతో చెలగాటం

ఏలూరులో ద్విచక్రవాహనాలపై ట్రిపుల్ రైడింగ్ యథేచ్ఛగా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ముగ్గురు ప్రయాణిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. 10లో ▸

న్యూస్‌రీల్

రాష్ట్రాభివృద్ధికి కేంద్ర సహకారం



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం: రాష్ట్రానికి కావల్సింది ప్రత్యేక హోదా కాదని, రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ స్పష్టం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర పరిస్థితిపై కేంద్ర మంత్రులు, ఇతర అధికారులను కలిసి చర్చించినట్లు చెప్పారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, విశాఖ ఉక్కు కర్మాగారం వంటి విషయాలపై కేంద్ర పెద్దలతో మాట్లాతానని స్పష్టం చేశారు. రాష్ట్రాభివృద్ధికి ప్రధాని మోదీ కట్టుబడి ఉన్నారన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పాక వెంకట సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల సుభాష్, కాయిత సురేంద్ర, జుత్తిగ నాగరాజు, కోమటి రవికుమార్, రావూరి సుధ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి



పోలవరం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం సమర్పిస్తున్న వలంటీర్లు

పోలవరం రూరల్: వలంటీర్లకు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు మాటను నిలబెట్టుకుని వలంటీర్లను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ పోలవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి వై.కొండలరావుకు వినతిపత్రం సమర్పించారు. గౌరవ వేతనం రూ.5 వేల నుంచి రూ.10 వేలు పెంచుతానని ఇచ్చిన హామీ మేరకు వెంటనే పెంచాలన్నారు. ప్రతి వలంటీర్‌ను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కచ్చితత్వంతో ఎన్యూమరేషన్ చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జాతీయ రహదారుల భూ సేకరణలో ఎన్యూమరేషన్ కచ్చితత్వంతో నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య సర్వే అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య సర్వే అధికారులతో సమావేశమై పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ హైవేస్ భూ సేకరణలో భాగంగా ఆయా భూముల్లో ఉన్న ఇళ్ళు, షెడ్లు, చెట్లు వంటివి కచ్చితంగా లెక్కించాలన్నారు. భూసేకరణలో భాగంగా ఎన్యుమరేషన్ నిర్వహించేందుకు టీంలు ఏర్పాటు చేశామని, టీ లో ఇచ్చిన రిపోర్టులను తిరిగి తనిఖీ చేసేందుకు మరొక టీం ఏర్పాటు చేస్తామన్నారు. సర్వేపై ఫిర్యాదులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.శ్రీనివాసులు రాజు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, ఆర్ అండ్ బి అధికారి ఎస్.లోకేశ్వరరావు, కలెక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్ సీహెచ్.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికత సాయంతో సమర్థంగా విధులు

భీమవరం: సాంకేతికతను ఉపయోగించుకుని సమర్థవంతంగా విధులు నిర్వహించవచ్చని ఏపీఆర్ఆర్‌పీ ప్రాజెక్ట్ సలహాదారులు కె.ప్రభాకర్ రెడ్డి, వై.నరసింహ సూచించారు. పశ్చిమగోదావరి జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో విష్ణు కళాశాలలో మంగళవారం సీసీ రోడ్లు, సివిల్ ఇంజనీరింగ్ యాప్స్ మీద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు కేటాయించిన విధులను సమర్థంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు దృష్టి పెట్టాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లి నివృత్తి చేసుకోవాలని సూచించారు.

11న జాబ్ మేళా

ఏలూరు(మెట్రో): ఈ నెల 11న ఏలూరు కలెక్టరేట్ వద్ద విజయ డైరీ ఎదురుగా ఉన్న జిల్లా స్థాయి శిక్షణా కేంద్రంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ జిల్లా స్థాయి శిక్షణ సంస్థ డీఎల్‌టీసీ, ఐటీఐ సహాయ సంచాలకుడు ఉగాది రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీలు హాజరయ్యే జాబ్ మేళాకు ఐటీఐ ఉత్తీర్ణులై, అప్రెంటిస్ పూర్తి చేసిన అభ్యర్థులు, ఐటీఐ చివరి సంవత్సరం చదువుతున్న ట్రైనీలు హాజరు కావచ్చన్నారు.

తల్లికి వందనమేది?

- విద్యార్థులకు ఏడాదికి రూ.15 వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం
- జిల్లాలోని మొత్తం విద్యార్థులు 2,49,662
- 70 శాతం అర్హులుంటారని అంచనా
- పాఠశాలలు తెరిచి నెల రోజులైనా ఖరారు కాని విధివిధానాలు
- ప్రభుత్వ సాయం కోసం తల్లుల ఎదురుచూపులు
- గత ప్రభుత్వంలోని నాలుగేళ్లలో 1,48,342 మందికి రూ.888 కోట్ల లబ్ధి



సాక్షి, భీమవరం: 'పేదల విద్యను ప్రోత్సహించేందుకు తల్లికి వందనం పథకం కింద ప్రతి పాఠశాల విద్యార్థికి ఏడాదికి రూ. 15,000 చొప్పున అందిస్తాం. ఇంట్లో ఎందరు పిల్లలుంటే అందరికి ఈ పథకాన్ని వర్తింపచేస్తాం'. ఎన్నికలు సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇది. బడులు తెరిచి నెలరోజులవుతున్నా తల్లికి వందనం సాయం విడుదల కోసం తల్లిదండ్రులు ఆశగా ఎదురుచూస్తున్నారు. గతంలో పేద కుటుంబాలు తమ పిల్లలను చదివించాలంటే ఇబ్బంది పడేవారు. కొందరు చదువులు మధ్యలోనే మాన్పించేసి పిల్లలను పనులకు పంపేవారు. పేదల విద్యకు అధిక ప్రాధాన్యమిచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వారిని ప్రోత్సహించేందుకు దేశంలో ఎక్కడా లేని విధంగా అమ్మ ఒడి పథకం ప్రవేశపెట్టి అమలుచేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివించే పేదవర్గానికి చెందిన తల్లుల ఖాతాలకు ఏడాదికి రూ.15 వేల చొప్పున అందిస్తూ వచ్చారు. 2019 నుంచి సార్వత్రిక ఎన్నికల వరకు నాలుగు విడతల్లో 1,48,342 మంది తల్లుల ఖాతాలకు రూ.887.9 కోట్లు జమ చేశారు. డ్రాపవుట్స్ సమస్యకు చెక్ పెట్టారు. ప్రతి తల్లి తన పిల్లల్ని బడికి పంపేలా ప్రోత్సహించారు. అమ్మఒడి సాయాన్ని ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజుల అవసరాల కోసం వినియోగించుకోగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్ అవసరాల కోసం వెచ్చించేవారు.

ఎంతమంది ఉంటే అంతమందికి

ప్రస్తుత విద్యాసంవత్సరానికి ఇంతవరకు నమోదైన అడ్మిషన్ వివరాల మేరకు జిల్లాలోని 1,340 ప్రభుత్వ పాఠశాలల్లో 98,899 మంది విద్యార్థులు ఉండగా, 470 ప్రైవేట్ పాఠశాలల్లో 1,12,263 మంది విద్యార్థులున్నారు. ఇంటర్ విద్యార్థులు 38,500 మంది ఉన్నారు. మొత్తం 2,49,662 మంది విద్యార్థులు ఉండగా వీరిలో పేద విద్యార్థులు 70 శాతం మంది వరకు ఉంటారని అంచనా. అడ్మిషన్ల నమోదు ప్రక్రియ పూర్తయితే విద్యార్థుల సంఖ్య మరింత పెరుగుతుందని విద్యాశాఖ వర్గాలంటున్నాయి. ఒక ఇంట్లో చదువుకునే పిల్లలు ఎంతమంది ఉంటే అందరికి ఈ పథకం కింద సాయం అందిస్తామని కూటమి ప్రకటించింది. ఈ మేరకు 1,74,763 మంది పిల్లలకు ఈ ఏడాది రూ.15,000 చొప్పున రూ.262 కోట్ల సాయం అందించాల్సి ఉంది. విద్యార్థుల సంఖ్య పెరిగితే ఈ సాయం పెరుగుతుంది. ఇప్పటికే పాఠశాలలు తెరిచి నెలరోజులు కావస్తోంది. తల్లికి వందనం సాయం విడుదలపై ఇంకా స్పష్టత లేదు. విధివిధానాలు ఖరారైన దాఖలాలు లేవు. రెక్కలు ముక్కలు చేసుకుని ప్రైవేట్ పాఠశాలల్లో తమ పిల్లలను చదివించే పేద వర్గాలకు ఈ సాయం ఎంతో ఆసరా. త్వరితగతిన తల్లికి వందనం సాయం విడుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో జిల్లాలో అందించిన అమ్మఒడి సాయం

సంవత్సరం	లబ్ధిదారులు	ప్రభుత్వసాయం
2020	1,47,900	రూ. 221 కోట్లు
2021	1,51,401	రూ. 226.9 కోట్లు
2022	1,50,536	రూ. 224.6 కోట్లు
2023	1,43,534	రూ. 215.4 కోట్లు

బాలల సంరక్షణకు సమష్టిగా కృషిచేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ జె.రాజేంద్రప్రసాద్

ఏలూరు(మెట్రో): అంగన్‌వాడి కార్యకర్త నుంచి సూపర్‌వైజర్, సీడీపీఓలు బాలల హక్కులు, రక్షణపై అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం బాలల సంరక్షణ అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. ఎక్కడైనా బాలలు లైంగికంగా, మానసికంగా, శారీరకంగా దోపిడీకి గురయితే వెంటనే వివరాలు సేకరించి వారికి తక్షణమే న్యాయం జరిగేలా జిల్లాలోని బాలల రక్షణ సమితికి అందజేయాలన్నారు. ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కెవీఎల్ పద్మావతి మాట్లాడుతూ బాలలకు ఎలాంటి సాయం అందించాలనే దానిపై పూర్తిగా అవగాహన పెంచుకొని వారి సంరక్షణకు అందరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ కె.హైమావతి తదితరులు పాల్గొన్నారు .

రుణాల మంజూరులో ఆలస్యం చేయొద్దు



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి బ్యాంకర్లకు కేటాయించిన లక్ష్యాల మేరకు లబ్ధిదారులకు నూరు శాతం రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ సి.నాగరాణి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకర్లంతా లక్ష్యాలు చేరుకోవడం ముఖ్యమని, కొన్ని బ్యాంకులు రుణాల మంజూరులో తాత్సారం తగదన్నారు. ముద్ర వీవర్స్ రుణాలకు సంబంధించి అన్ని బ్యాంకులు లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. కౌలు రైతులు అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణాలు అందించాలన్నారు. విద్య రుణాలు, వ్యవసాయ సదుపాయాలు, స్వనిధి, రివర్స్ రుణాలు, ఎంప్లాయిమెంట్ జనరేషన్ రుణాలు, పీఎంఈజీపి, విశ్వకర్మ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కోసం రుణాల మంజూరు, ఇలా అన్ని పథకాల కింద పూర్తి స్థాయిలో లక్ష్యాలు చేరుకోవాలన్నారు. 2023-24 రుణ ప్రణాళికలో నిర్దేశించిన విధంగా విద్య, గృహ రుణాల లక్ష్యాలను సాధించలేకపోవడంపై బ్యాంకర్లను జిల్లా కలెక్టర్ ఆరాతీశారు. 2024-25 వార్షిక రుణ ప్రణాళికలో గత సంవత్సరంలో మిగిలిన లక్ష్యాలను కలుపుకొని ప్రగతి సాధించాలని తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలో ప్రత్యేకంగా రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుకు అనుమతి మంజూరు చేశామన్నారు. యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు జరుగుతాయని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం నిధులను సమకూరుస్తుందని తెలిపారు. యువతలో నైపుణ్య అభివృద్ధిని పెంచి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ సంస్థ ఉపయోగపడుతుందన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు, లీడ్ బ్యాంకు మేనేజర్ ఎ.నాగేంద్రప్రసాద్, ఆర్‌బీఐ ఏజీఎం ఆర్.హనుమంత కుమారి, యూబీఐ డిప్యూటీ రీజనల్ హెడ్ వెంకన్న బాబు, నాబార్డ్ డీడీ టి.అనిల్ కాంత్, తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్ల తర్వాత తల్లి చెంతకు

అధికారుల చొరవతో పశ్చిమ బెంగాల్ నుంచి రాష్ట్రానికి



అధికారులను అభినందిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రం హౌరా అధికారుల చొరవతో ఓ బాలుడు తన కన్న తల్లి చెంతకు చేరాడు. ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలానికి చెందిన 12 ఏళ్ల బాలుడు అలిగి 2021లో ఇంట్లోంచి వెళ్లిపోయాడు. తల్లి ఎవరికీ ఫిర్యాదు చేయలేదు. ఎవరైనా అడిగితే బంధువుల ఇంటికి వెళ్ళాడని చెప్పేది. హౌరా రైల్వే స్టేషన్‌లో ఆ బాలుడిని గుర్తించిన రైల్వే శాఖ పోలీస్ సిబ్బంది చేరదీసి హౌరాలోని స్థానిక 'ఐటీ ఇండియా కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ' చైల్డ్ కేర్ సంస్థలో జాయిన్ చేశారు. ఇటీవల అధికారులు 'ఘర్ పోర్టల్'లో వివరాలు నమోదు చేస్తుండగా.. తనది ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా అని చెప్పాడు. దీంతో హౌరా అధికారుల బృందం ఏలూరు జిల్లా బాలల సంరక్షణ అధికారి సూర్యచక్రవేణిని ఫోన్‌లో సంప్రదించారు. డీసీపీవో అతని తల్లిదండ్రుల పేర్లు, ఊరు వివరాలు అడగ్గా.. కె.ఆర్.పురం పరిధిలోని కోయ గిరిజన వర్గానికి చెందిన వాడినని బాలుడు తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.పద్మావతి పర్యవేక్షణలో డీసీపీవో బాలుడి ఫొటోతో పలు గిరిజన హాస్టళ్ల సహా గ్రామాల్లో విచారణ చేపట్టారు. చివరకు బుట్టాయిగూడెంలో బాలుడి తల్లిని గుర్తించారు. బుట్టాయిగూడెం నుంచి తల్లితో కొడుకుకు వీడియో కాల్ ఏర్పాటు చేశారు. బాలుడు తల్లిని గుర్తించడంతో ఆ బాలుడిని ఏలూరు జిల్లా పంపేందుకు అవసరమైన పత్రాలు సమర్పించాలని హౌరా పోలీసు అధికారులు కోరగా సంబంధిత వివరాలు పంపారు. జూలై 8న ఉదయం సంబంధిత అధికారుల పర్యవేక్షణలో బాలుడిని రైలులో ఏలూరుకు తీసుకొచ్చి శనివారపుపేటలోని జిల్లా బాలల సంరక్షణ సమితి ముందు హాజరుపర్చారు. అనంతరం మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సమక్షంలో బాలుడిని అతని తల్లికి క్షేమంగా అప్పగించారు. స్థానిక అంగన్‌వాడీ వారి ద్వారా ఎప్పటికప్పుడు ఫాలో అప్ చేసుకుని ఏదైనా వృత్తి విద్యా కోర్సులు ఆబాలుడికి నేర్పించాలని డీసీపీవోను కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. అయితే సుదీర్ఘ కాలంగా దూరం అయిన కొడుకు ఈరోజు అధికారుల కృషి వల్ల తిరిగి తన వద్దకు చేరటంతో ఆ తల్లి ఎంతో సంతోషపడింది. ఈ సందర్భంగా బాలుడి వివరాలు గుర్తించి క్షేమంగా తల్లికి అందించిన ఏలూరు జిల్లా డీసీపీవో, ఐసీడీఎస్ సిబ్బందిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కె. పద్మావతి, డీసీపీవో సీహెచ్ సూర్య చక్రవేణి, బుట్టాయగూడెం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీ, డీసీపీయు ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మురికికూపంగా జాతీయ రహదారి



ఆకివీడులో దుర్గంధం వెదజల్లుతున్న జాతీయ రహదారి ప్రాంతం

ఆకివీడు: ఇది ఏ మూరుమూల రోడ్డో కాదు.. ఆకివీడు ప్రాంతంలో జాతీయ రహదారి. డెంగ్యూ నివారణపై వారోత్సవాలు నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బందికి, స్థానిక నగర పంచాయతీ పారిశుధ్య అధికారులకు, జాతీయ రహదారుల శాఖ అధికారులకు ఈ దుర్గంధం పట్టడం లేదు. గత వారం రోజులుగా స్థానిక కెనరా బ్యాంకు నుంచి జెడ్పీ హైస్కూల్ వరకూ జాతీయ రహదారి మురికినీటితో నిండిపోయింది. ఈ ప్రాంతంలో ముంపు నీరు నిలబడిపోతోంది. దీనికి తోడు కొత్తగా పెట్టిన రెస్టారెంట్ నుంచి వచ్చే వ్యర్థాతో రోడ్డు నిండిపోయింది. అపార్టుమెంట్‌కు సంబంధించిన మురుగు నీరు రహదారిపైకి వచ్చి దుర్గంధాన్ని వెదజల్లుతోంది. ఇక్కడి మురుగు నీటిలో దోమలు ప్రబలుతున్నాయి. డెంగ్యూ దోమలకు నిలయంగా ఈ ప్రాంతం మారిపోతుందని ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

రూ.380కి చేరిన వర్జీనియా ధర



జంగారెడ్డిగూడెంలో వేలానికి వచ్చిన పొగాకు బేళ్లు

జంగారెడ్డిగూడెం: వర్జీనియా పొగాకు ధర రూ.400 వైపు పరుగులు పెడుతోంది. మంగళవారం ఎస్ఎల్ఎస్ పరిధిలోని ఐదు వేలం కేంద్రాల్లో నిర్వహించిన వేలంలో గరిష్ట ధర రూ.380 పలికింది. గత ఏడాది అత్యధిక ధర రూ.288ను పోల్చుకుంటే ఇప్పటి వరకు రూ.92 అధికంగా నమోదు చేయడం విశేషం. ఈ ఏడాది మార్చి 6న వర్జీనియా పొగాకు వేలం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల్లో ప్రారంభమైంది. ప్రారంభ ధర కేజీ ఒక్కింటికి రూ.240 లభించింది. క్రమేపీ పెరుగుతూ, తన రికార్డులను తానే బద్దలు కొట్టుకుంటూ ముందుకు సాగుతోంది. మంగళవారం ధర రూ.380కు చేరుకుని జీవితకాల సరికొత్త గరిష్టాన్ని నమోదు చేసింది. ఎస్ఎల్ఎస్ పరిధిలోని ఐదు వేలంకేంద్రాల్లో రెండు కేంద్రాల్లో మంగళవారం కేజీ ఒక్కింటికి రూ.380 గరిష్ఠ ధర నమోదు చేసుకుంది. మంగళవారం జరిగిన వేలంలో జంగారెడ్డిగూడెం-1, -2 వేలం కేంద్రాల్లో గరిష్ఠ ధర రూ. 380 చేరుకోగా, కొయ్యలగూడెం, గోపాలపురం వేలం కేంద్రాల్లో రూ.379, దేవరపల్లి వేలం కేంద్రంలో రూ.378 నమోదు చేసింది.

నిత్యావసరాల ధరల నియంత్రణకు సహకరించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): బహిరంగ మార్కెట్లో నిత్యావసరాల ధరల నియంత్రణకు వర్తకులు సహకారం అందించాలని జాయింట్ కలెక్టరు సీవీ ప్రవీణ్ ఆదిత్య అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా కలెక్టరు కార్యాలయం వశిష్ట కాన్ఫరెన్స్ హాలులో జాయింటు కలెక్టరు సంబంధిత అధికారులు, రిటైల్ అమ్మకందారులతో సమావేశమై బహిరంగ మార్కెట్లో నిత్యావసరాల ధరల స్థిరీకరణపై సమీక్షించారు. అన్ని రైతు బజార్లు, సూపర్ మార్కెట్ల వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, రేట్ల వివరాలను అందరికీ కనబడేలా డిస్‌ప్లే చేయాలన్నారు. బియ్యం, కంది పప్పు మార్కెటు ధర కంటే తక్కువ ధరకు అమ్మకాలు చేయాలని ఆదేశించారు. స్టీమ్ రకం బియ్యం కిలో రూ.49, ముడి రకం బియ్యం కిలో రూ.48, కందిపప్పు (దేశవాళీ) కిలో రూ.160కి అమ్మాలని ఆదేశించారు. హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు ఈ నెల 12లోగా వారి వద్ద ఉన్న అన్ని పప్పు నిల్వలు భారత ప్రభుత్వం వెబ్‌పోర్టల్ నమోదు చేయాలని ఆదేశించారు. నిత్యావసరాల ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సి.నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): కాలానుగుణ వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు విస్తృత పారిశుధ్య కార్యక్రమాలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని కలెక్టర్ సి.నాగరాణి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో కలెక్టర్ సి.నాగరాణి మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో సమావేశమై ఆయా శాఖలలో కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సి.నాగరాణి మాట్లాడుతూ జిల్లా అంతటా కంటికి కనిపించేంత స్పష్టంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. వర్షాకాలం సీజన్‌లో డయేరియా, డెంగ్యూ, జ్వరాలు అపరిశుభ్రత, నీటి కలుషితం కారణంగా ప్రభలుతాయన్నారు. వీధుల్లో, షాపుల ముందు, డ్రైనేజీల్లో చెత్త వేయకుండా నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే చెత్త వేసేలా విస్తృత అవగాహన కల్పించాలన్నారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా ఉంచి అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీల వారీగా పారిశుధ్య కార్యక్రమాలపై ఆయా మున్సిపల్ కమిషనర్లు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ సీహెచ్ నరసింహరాజు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ ఏ.సుధాకర్, భీమవరం మున్సిపల్ కమిషనర్ శ్యామల, ఈఈ త్రినాథరావు, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారి విజయ్, మున్సిపల్ కమిషనర్లు, సహాయ మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ ఈఈలు, ఏఈలు పాల్గొన్నారు. మంగళవారం సాయంత్రం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని ఎంపీడీవోలు, ఈఓపిఆర్డీలు, పంచాయతి సెక్రటరీలతో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో నూరుశాతం పారిశుధ్య కార్యక్రమాలు కచ్చితంగా జరగాలన్నారు. డ్రెయిన్లలో నీటిపారుదలకు ఆటంకం లేకుండా డీసిల్టింగ్ చేయాలని, మట్టిని దూరంగా ఒక ప్రాంతంలో వేయాలన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా అందించిన ఫాగింగ్ మిషన్లు, తదితర పనిముట్లను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గతంలో డయేరియా ప్రబలిన ప్రాంతాలను తెలుసుకొని ఆ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చేపల చెరువుల నీటి కారణంగా తాగునీటి వనరులు కలుషితం కాకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, పంచాయతీ సెక్రటరీలు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది ఒక టీం గా ఏర్పడి పారిశుద్ధ్యంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలన్నారు. కాన్ఫరెన్స్‌లో పంచాయతీ అధికారి విక్టర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి నాగేశ్వరరావు, డీఎల్‌డీఓ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెరుగుతున్న గోదావరి వరద



పోలవరం వద్ద వరద నీరు

పోలవరం రూరల్: గోదావరిలో నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. మంగళవారం సాయంత్రానికి పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 26.580 మీటర్లకు నీటిమట్టం చేరింది. ఎగువ నుంచి వస్తున్న నీటిని వచ్చినట్లుగా 48 గేట్ల నుంచి దిగువకు చేరుతోంది. క్రమేపీ ప్రాజెక్టు దిగువన కూడా నీటిమట్టం పెరుగుతోంది. నదీ పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో పాటు కొండలవాగుల నీరు కూడా నదిలోకి చేరడంతో వరద పెరుగుతూ, తగ్గుతూ ప్రవహిస్తోంది.

కలెక్టర్‌ను కలిసిన జడ్జిలు



కలెక్టర్ వెట్రిసెల్విని కలిసిన న్యాయమూర్తులు

ఏలూరు (మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కొత్తగా వివిధ కోర్టులలో నియమితులైన న్యాయమూర్తులు పీవీ నాగరంజిత్ కుమార్ (తణుకు), కాళహస్తి రాజరాజేశ్వరి తేజస్వి (జంగారెడ్డిగూడెం), వీఎస్ఎస్ లక్ష్మి లావణ్య (పాలకొల్లు), బండి రచన (ఏలూరు) మంగళవారం ఏలూరులో కలెక్టర్ కె.వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రెవెన్యూ అంశాలపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో న్యాయమూర్తులు పాల్గొన్నారు. డీఆర్వో డి.పుష్పమణి, ఏలూరు ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఆకస్మిక దాడులు

281 మీటర్ల తనిఖీ,
రూ.8.72 లక్షల జరిమానా



కలిదిండిలోని ఓ ఇంట్లో విద్యుత్ మీటర్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

కైకలూరు: కలిదిండి విద్యుత్ సెక్షన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాలు, ఆక్వా చెరువులపై మీటర్లను పరిశీలించారు. విజిలెన్స్ ఈఈ ఓ.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధికారులు 40 బృందాలుగా ఏర్పడి చేసిన ఈ తనిఖీలలో 281 సర్వీసు మీటర్లలో అదనపు లోడు మొత్తానికి రూ.8.42 లక్షలు, 2 సర్వీసులకు విద్యుత్ చౌర్యం చేసినందుకు రూ.30 వేలు వెరసి రూ.8.72 లక్షల జరిమానా విధించామని గుడివాడ ఈఈ టీ.రామకృష్ణ చెప్పారు. విద్యుత్ చౌర్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగినట్లయితే 9440 812362. 9440812363 నంబర్లకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. తనిఖీలలో గుడివాడ డివిజన్ పరిధిలో ఏడీలు, ఏఈఈలు పాల్గొన్నారు.

'వెదజల్లు'తో ప్రయోజనాలెన్నో

- వరి సాగులో వెదజల్లు విధానం ఎంతో మేలు
- డ్రమ్‌సీడ్ విధానంలోనూ పెట్టుబడి ఖర్చు ఆదా
- తక్కువ నీటి వినియోగంతో అధిక దిగుబడి
- పంటలో తగ్గనున్న తెగుళ్లు, క్రిమికీటకాల బెడద



మొగల్లులో వెదజల్లు పద్ధతిలో సాగు చేసిన వరి పంట (ఫైల్)

భీమవరం: వ్యవసాయమే జీవనాధారమైన జిల్లాలో రైతులకు ఎన్నో ఆటుపోట్లు ఎదురవుతున్నా వినూత్న పద్ధతులతో వరి సాగు చేస్తూ ఖర్చులు తగ్గించుకోడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. పెరిగిన పెట్టుబడులతో వరి సాగు కష్టమైనప్పటికీ యాంత్రీకరణతో నష్టాలను తగ్గించుకుని లాభాలబాట పడుతున్నారు. జిల్లాలో సుమారు 2.10 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా అనేక మంది రైతులు ఆధునిక సాగు పద్ధతులను అవలంబిస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. దీనిలో భాగంగానే వరిలో వెదజల్లు, డ్రమ్‌సీడ్ పద్ధతిలో సాగు చేస్తూ పెట్టుబడులు తగ్గించుకుంటూ వ్యవసాయం దండగ కాదు పండగ అని నిరూపిస్తున్నారు. గత ప్రభుత్వంలో పెట్టుబడి సాయం, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా కేంద్రాల ద్వారా తక్కువ ధరకే ఎరువులు, పురుగుమందుల విక్రయాలు, దళారుల ప్రమేయం లేకుండా ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి రైతు బ్యాంకు ఖాతాల్లోనే సొమ్ములు జమచేయడం వంటి పద్ధతులు అవలంభించి రైతులకు అండగా నిలిచింది.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే..

సాధారణ పద్ధతిలో నాట్లు వేసే రైతులకు దిగుబడి, నాణ్యమైన పంట చేతికి వచ్చినప్పటికీ పెట్టుబడి అధికం అవుతుంది. అదే వెదజల్లు పద్ధతిలో సాగు చేస్తే పెట్టుబడి ఖర్చు తగ్గించుకునే అవకాశముంది. అంతేకాక ప్రధానంగా మారిన వాతావరణ పరిస్థితుల్లో తక్కువ నీటితో అధిక దిగుబడులు పొందవచ్చు. ప్రతికూల పరిస్థితుల్లో సాగు ఆలస్యమైనప్పుడు వెదజల్లే విధానంతో సమయం కూడా కలిసివస్తుంది.

ఉపయోగాలు ఇవే..

ఎకరం విస్తీర్ణంలో వరి నారుమడి పెంపకం, నాట్లు వేసేందుకు దాదాపుగా రూ.10 వేలు ఖర్చు అవుతుంది. విత్తనాల ఖర్చు 50 శాతం తగ్గించుకోవచ్చు. పంట నేలకు వాలిపోకుండా సుమారు 15 రోజులు ముందుగానే మాసూళ్లు చేసుకోవచ్చు. అలాగే తెగుళ్లు, క్రిమికీటకాల బెడద తగ్గించుకోవచ్చు. కోత కోసే సమయంలో కోత యంత్రాలతో సులువుగా మాసూలు చేసుకునే అవకాశం ఉంటుంది.

నేల తయారీ ఇలా..

చేలకు నీరు పెట్టిన తరువాత నేలను పలుమార్లు దున్ని మెత్తగా తయారు చేయాలి. ఆఖరి దుక్కిలో వ్యవసాయాధికారుల సూచనల మేరకు భాస్వరం, పొటాష్ ఎరువులు లేదా వేప పిండి, ఆముదం పిండి వంటి వాటిని వేసి నేలను కలియదున్నాలి. తేమను చూసుకుని రొటావేటర్‌తో విత్తనాలు వేసుకోవడం మంచిది. కాలి బాటల వల్ల పైరుకు వెలుతురు, గాలి తగలడం, ఎరువులు సులువుగా వేసుకోవడం, చీడపీడల నివారణ తదితర ప్రయోజనాలు ఉన్నాయి. విత్తనాలు మొలక వచ్చిన తరువాత మొక్కలు లేని చోట వరి నారు తీసుకుని నాటవచ్చు. కలుపు నివారణకు గల రకాలు ఎంచుకోవడం ద్వారా కలుపు సమస్య కొంత వరకూ అధిగమించవచ్చు. వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేసే సమయంలో వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన విధంగా విత్తనాలు చల్లుకోవాలి. సన్న రకాలు ఎకరాకు 18 కిలోలు, ముతక రకాలు 22 కేజీలు వేసుకోవాలి. విత్తనాలు ఒత్తుగా వేయడం వల్ల చేతికి వచ్చే సమయంలో పంట పడిపోయే ప్రమాదమేగాకుండా ఒత్తుగా ఉంటే నేలకు గాలిసోకక చీడపీడలు ఆశించే ప్రమాదముంది. కాలి బాటలు తప్పనిసరిగా వేసుకుని నత్రజని తగ్గించుకోవడం వల్ల ప్రయోజనముంటుంది.

విత్తన ఎంపిక కీలకం



వరిసాగులో వెదజల్లే పద్ధతిలో విత్తనాల ఎంపిక అత్యంత కీలకం. భూసారాన్ని బట్టి విత్తనాలను ఎంపిక చేసుకుని విత్తనశుద్ధి తరువాత చల్లుకోవాలి. భూమి మొత్తం చదునుగా చేసుకుని నీరు త్వరితగతిన బయటకు వెళ్లేలా తయారు చేసుకోవాలి. సరైన సమయంలో తగిన మోతాదులో కలుపు మందు పిచికారీ చేయాలి. కలుపు మందు పిచికారీ చేసే సమయంలో పొలంలో నీరు పలుచగా ఉండేలా చూడాలి. తర్వాత కూడా రెండు రోజుల వరకూ నీరు నిల్వ ఉండేలా జాగ్రత్తలు అవసరం. విత్తనాలు వేసిన 15 రోజులకు, పిలక దశ, చిరుపొట్ట దశలో ఎరువులు వేయాలి. చిరుపొట్ట దశలో నత్రజనితో పాటు పొటాష్ ఎరువును విధిగా వేయాలి.

– జెడ్ వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

వైజ్ఞానిక స్పృహతోనే దేశాభివృద్ధి



ధ్రువపత్రాలు అందజేస్తున్న నిట్ రిజిస్ట్రార్

తాడేపల్లిగూడెం: బాల్యం నుంచే ఆలోచనలకు పదును పెట్టాలని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ శంకర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. ఏపీ నిట్, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్ మనాక్ మెంటార్‌షిప్–2024 అనే అంశంపై రెండు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్ మంగళవారం ముగిసింది. దినేష్ రెడ్డి మాట్లాడుతూ వైజ్ఞానిక స్పృహతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. సృజనాత్మక ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ప్రతి విద్యార్థి విభిన్నంగా ఆలోచన చేయాలని, పాఠశాల స్థాయిలోనే సరికొత్త ఆలోచనలు అంకురించి నవకల్పనకు బాటలు వేస్తాయన్నారు. విద్యార్థులు పుస్తకాలతో స్నేహం చేయాలని వివరించారు. జాతీయ స్థాయికి ఎంపికైన 24 మంది విద్యార్థులు ఆగస్టు నెలలో ఢిల్లీలో ఆయా ఆవిష్కరణలను ప్రదర్శించాలన్నారు. విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ప్రాజెక్టు అసోసియేట్ డాక్టర్ సునీల్ సునీల్ భాస్కర్, ఎస్‌జీ శ్రీనివాస్, డాక్టర్ భాగ్యశ్రీ, డాక్టర్ మేరీ డాక్టర్ పి.శంకర్, సందీప్, ఫణికృష్ణ, కార్తికేయ శర్మ, వినోద్‌కుమార్ రాజా, భరణి, సుదర్శన దీప, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో వేధింపులు.. బాలిక బలవన్మరణం



మిస్లియా మృతదేహం

కైకలూరు: ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేయడంతో మనస్తాపానికి గురై ఓ బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. కైకలూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమేశ్వరం కాలనీకి చెందిన దాసరి యోహోషువా, మరియమ్మకు మిస్లియా (17), మరో స్పైలీ సంతానం. భర్తతో విబేధాల కారణంగా ఎనిమిదేళ్ల క్రితం అతని నుంచి విడిపోయి మరియమ్మ ఇద్దరు కుమార్తెలతో కలిసి సోమేశ్వరం కాలనీలో నివసిస్తోంది. పెద్ద కుమార్తె మిస్లియా ఆకివీడు విద్యావికాస్ కాలేజీలో ఇంటర్ చదివింది. ఆ సమయంలో మిస్లియాను అదే కాలేజీలో చదివిన ఆకివీడు మండలం ఉప్పరగూడెంకు చెందిన బొదనపు కిరణ్‌కుమార్ (20) ప్రేమపేరుతో వేధింపులకు గురిచేశాడు. దీంతో మనస్తాపానికి గురైన మిస్లియా సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బయట నుంచి వచ్చిన తల్లి మరియమ్మ ఫ్యాన్‌కు వేలాడుతున్న కుమార్తె మృతదేహాన్ని చూసి బోరుమంటూ విలపించింది. కుమార్తె ఆత్మహత్యపై మరియమ్మ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. రూరల్ ఎస్సై టి.రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న 108

ఇద్దరు రోగులకు, డ్రైవర్‌కు స్వల్ప గాయాలు



ఘటనా స్థలంలో ప్రమాద దృశ్యం

దెందులూరు: రోగులను ఆస్పత్రికి తీసుకెళుతుండగా 108 వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ప్రమాదంలో రోగులకు, వాహన సిబ్బందికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. కైకరం గ్రామం నుంచి కె.అర్జున్, ఎస్.జయ అనే రోగులను డయాలసిస్ కోసం ఏలూరు ఆస్పత్రికి తరలిస్తుండగా సత్యనారాయణపురం వద్ద 108 వాహనం అదుపుతప్పి రహదారి మార్జిన్‌లో ఉన్న విద్యుత్ స్తంభం దిమ్మెను ఢీకొంది. ఈ ప్రమాదంలో రోగులకు, వాహనం డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని వేరే వాహనంలో చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

18 నుంచి కుష్టు వ్యాధిపై ఇంటింటా సర్వే



కుష్టు వ్యాధి నిర్మూలన పోస్టర్ ఆవిష్కరించిన డీఆర్వో భాస్కరరావు, ఇతర అధికారులు

భీమవరం (ప్రకాశం చౌక్): జిల్లాలో కుష్టు వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు కృషి చేయాలని డీఆర్వో జె.భాస్కరరావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో కుష్టు వ్యాధి నిర్మూలనపై మంగళవారం నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో డీఆర్వో మాట్లాడారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఈనెల 18 నుంచి ఆగస్టు 2 వరకు జిల్లాలో ఇంటింటా సర్వే జరగనుందన్నారు. కుష్టు వ్యాధిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని, వ్యాధి కారణాలు, చికిత్స, నివారణా చర్యలను వివరించాలని సూచించారు. ప్రతి పాఠశాలలో ప్రతి విద్యార్థిని తనిఖీ చేసి స్పర్శ లేని మచ్చలు, ఇతర లక్షణాలు ఏమైనా ఉంటే గుర్తించాలన్నారు. కుష్టువ్యాధిని ముందుగానే గుర్తించడం ద్వారా అంగవైకల్యాన్ని నివారించవచ్చునని, అలాగే ఈవ్యాధిని ఎండీటీ చికిత్సతో పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. జిల్లా ఆసుపత్రులు కూడా తమ వద్దకు వచ్చే రోగుల్లో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. సర్వే సిబ్బందికి ప్రజలు పూర్తిగా సహకరించాలని, వ్యాధి లక్షణాలు ఉంటే తెలియజేసి, కుష్టురహిత జిల్లాగా మార్చేందుకు సహకారం అందించాలని డీఆర్వో కోరారు. అనంతరం కుష్టు వ్యాధి సమాచారంతో కూడిన పోస్టర్లను డీఆర్వో ఆవిష్కరించారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ డి.ఉమామహేశ్వరరావు, జిల్లా సహాయ వైద్యాధికారి బి.భానునాయక్, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాతరాణి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి పాల్గొన్నారు.

రైతులకు బాసటగా ఉండి కేవీకే



ఎన్నార్పీ అగ్రహారం కేవీకేలో స్వర్ణోత్సవ జ్యోతిని ఘంటశాల కేవీకేకు పంపిస్తున్న శాస్త్రవేత్తలు

ఉండి: ఎన్నార్పీ అగ్రహారంలోని కృషి విజ్ఞాన కేంద్రం వరి, అనుబంధ రంగాల రైతులకు బాసటగా నిలిచిందని కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎం.మల్లికార్జునరావు అన్నారు. దేశంలో కేవీకే స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న స్వర్ణోత్సవాల్లో భాగంగా స్వర్ణోత్సవ జ్యోతియాత్ర కార్యక్రమం మంగళవారం కేవీకేలో ముగిసింది. స్థానిక కేవీకే నుంచి స్వర్ణోత్సవ జ్యోతిని ఘంటశాల కేవీకేకు పంపించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మల్లికార్జునరావు మాట్లాడుతూ 1995లో ప్రారంభమైన ఎన్నార్పీ అగ్రహారం కేవీకే ఇప్పటి వరకు అనేక ప్రయోగాత్మక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యంగా రైతులకు వరిలో నాణ్యమైన విత్తనాలు అభివృద్ధి చేసి మన జిల్లాలోని రైతులకే కాకుండా ఇతర జిల్లాల రైతులతో పాటు ఇతర రాష్ట్రాలకు పంపించినట్లు తెలిపారు. అలాగే వ్యవసాయంతో పాటు దాని అనుబంధ రంగాలైన ఉద్యానం, రొయ్యలు, తేనెటీగలు, పుట్టగొడుగుల పెంపకం వంటి కార్యక్రమాల నిర్వహణతో పాటు వృత్తి శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం కేవీకేలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లోనూ కేవీకేలను ఏర్పాటు చేసి రైతులకు మరింత మేలు చేస్తోందని అన్నారు. సమావేశంలో రైతులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

బాలా త్రిపుర సుందరికి ఆషాఢ సారె

108 మహిళలు 108 రకాల స్వీట్స్, పండ్లు, పూలతో ఊరేగింపు



శ్రీబాలత్రిపుర సుందరిదేవి అమ్మవారికి సారె సమర్పించిన దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం మెంటేవారితోటలోని శ్రీబాలా త్రిపుర సుందరీదేవి అమ్మవారికి భక్తులు ఆషాఢ సారె అందించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో పట్టణానికి చెందిన తోటకూర కృష్ణ, ఫణిలక్ష్మి దంపతులతో ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి కుంకుమ పూజలు, పంచామృతాలతో అభిషేకాలను వేదమంత్రాలతో నిర్వహించారు. అనంతరం 108 మహిళలు 108 రకాల స్వీట్స్, పండ్లు, పూలతో మెంటేవారి తోటలోని పలు వీధుల్లో ఊరేగింపు నిర్వహించి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి సారె అందించి భక్తులకు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

త్వరలో రైతు బజార్లలో బియ్యం, కందిపప్పు విక్రయాలు

ఉమ్మడి జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్ణయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని రైతు బజార్లలో త్వరలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే కందిపప్పు, బియ్యం విక్రయించాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్ణయించినట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి వంకాయల రామకృష్ణ చెప్పారు. నిత్యావసరాలైన కందిపప్పు, బియ్యం మార్కెట్‌లో ధరలు ఎక్కువగా ఉన్నందున రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో రాష్ట్ర ఫెడరేషన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కర రావు ఆధ్వర్యంలో విజయవాడలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయించినట్లు స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రత్యేక కౌంటర్ల (రైతు బజారుల్లో) ద్వారా కిలో కందిపప్పు రూ.160, కిలో బియ్యం కిలో రూ.49 ఒక రకం, కిలో రూ.48 మరో రకం చొప్పున విక్రయిస్తామన్నారు. మంత్రితో జరిగిన సమావేశంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ తరఫున రామకృష్ణ, డాల్ మిల్లర్స్ తరఫున మద్దుల సత్యకుమార్, కల్వా సుబ్బారావు పాల్గొన్నట్లు తెలిపారు.

వారం గడిచినా కానరాని యువతి జాడ



ఏలూరు కాలువలో యువతి జాడ కోసం గాలిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఏలూరు గోదావరి కాలువలో గల్లంతైన ఓ యువతి ఆచూకీని వారం గడుస్తున్నా ఆమెను గుర్తించడంలో అధికారుల వైఫల్యంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మంగళవారం నారాయణపురం వంతెన పైనుంచి ఏలూరు కాలువలోకి ఓ యువతి దూకడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటి నుంచి ఆమె ఆచూకీ కోసం గాలిస్తున్నా ఆమె జాడ కనిపించకపోవడంతో బంధువులు, కుటుంబ సభ్యుల్లో ఆందోళన చెందుతున్నారు. అయితే అదే రోజు చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో పిచ్చెట్టి జాన్సీ (20) అనే యువతి కనిపించడం లేదని బంధువులు ఫిర్యాదు చేయడంతో నారాయణపురం వద్ద కాలువలోకి దూకిన ఈ మహిళే ఆమె అయి ఉండవచ్చని అనుమానించారు. జాన్సీ అదృశ్యంపై సీఐ సుభాష్ ఆధ్వర్యంలో చేబ్రోలు ఎస్సై మణికుమార్ కేసు నమోదు చేశారు. భీమడోలు ఫైర్ సిబ్బంది, కొవ్వూరు నుంచి గత ఈతగాళ్లను తీసుకువచ్చి కాలువలో వెదికించినా మహిళ జాడ లభ్యం కాలేదు. కాలువలో గుర్రపు డెక్క భారీగా పెరిగిపోవడంతో గాలింపు చర్యలకు ఆటంకంగా మారి యంత్రాంగానికి సవాల్‌గా మారింది.

ప్రమాదాలతో చెలగాటమేల!




ఏలూరు నగరంలో ద్విచక్రవాహనాలపై ట్రిపుల్ రైడింగ్ కల్చర్ పెరుగుతుండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా ఒకే బైక్‌పై ముగ్గురు వ్యక్తులు ప్రయాణిస్తుండటం ఇటీవల కాలంలో పెరిగిందని, దీంతో ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే వాదన వినిపిస్తోంది. ట్రాఫిక్ పోలీసులు స్పందించి చర్యలు తీసుకుంటే ప్రమాదాలను నివారించే అవకాశం ఉంది. దీనిపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు






ఏలూరులో ద్విచక్రవాహనంపై ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న దృశ్యాలు

క్లుప్తంగా

అభయాంజనేయస్వామికి విశేష పూజలు



వాసవిలో అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక వాసవి పంచాయతన క్షేత్రంలో 27 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహానికి మంగళవారం విశేష పూజలు జరిగాయి. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం, కోలాట భజన, హనుమాన్ చాలీసా పారాయణంలు జరిగాయి. ఆర్యవైశ్యులు మారం వెంకటేశ్వరరావు, వబిలిశెట్టి నటరాజ్, నున్న బాల త్రిపుర సుందరరావు, గంధం సతీష్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని అన్ని ఆలయాల్లోనూ ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు.

పారిశుద్ధ్యాన్ని తప్పకుండా పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ

తాడేపల్లిగూడెం రూరల్: పారిశుద్ధ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు మెరుగుపర్చాలని ఎంపీడీవో ఎస్.సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు. మంగళవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పారిశుద్ధ్యం, తాగునీరుపై పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీ, రక్షిత మంచినీరు సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్, ఆర్డబ్ల్యుఎస్ ఏఈ అధికారులు పాల్గొన్నారు.

30 మంది వృద్ధులకు ఉచిత వైద్య సేవలు



తణుకులో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 30 మంది వృద్ధులకు వైద్యసేవలు అందజేశారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో హాజరైన వృద్ధులకు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు వైద్యసేవలు అందజేయగా ఉచితంగా బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి పేదలకు మందులు పంపిణీచేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, సజ్జాపురం శాఖ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, సభ్యులు కోసూరి గాంధీ, ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు పాల్గొన్నారు.

ఆరుళ్లలో స్టూడెంట్ కిట్ల పంపిణీ



ఆరుళ్ల గ్రామంలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందజేసిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుళ్ల గ్రామంలో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెజవాడ వెంకటేశ్వరరావు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బేడ, బుడగలను ఎస్సీలుగా గుర్తించాలి

ఉండి: బేడ, బుడగ జంగాలను ఎస్సీలుగా గుర్తించి వారికి కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని సీపీఐ ఉండి ఏరియా కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు అన్నారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో బేడ, బుడగ జంగాల నాయకులు స్థానిక ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజును కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ తీవ్రంగా వెనుకబాటుకు గురైన బేడ, బుడగ జంగాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సనపల శ్రీనివాస్, కొమరాని శ్రీను, సంఘ అధ్యక్షుడు వీరన్నపల్లి పెద్దులు, నెల్లగంటి చెంచు, తదితరులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తే శ్రీరామరక్ష

- డ్రైడే ఫ్రైడేతో పరిసరాల పరిశుభ్రత
- జ్వరమే కదా అని వదిలేస్తే ప్రాణాంతకమే
- సీజనల్ వ్యాధులతో జాగ్రత్త అంటున్న వైద్యాధికారులు
- దోమల వ్యాప్తి నివారణే లక్ష్యంగా



తణుకులో డ్రైడే ఫ్రైడేపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది

తణుకు అర్బన్: ప్రతికూల వాతావరణంలో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, దోమల వల్లే జ్వరాల కేసులు అధికంగా నమోదవుతున్నాయి. పారిశుధ్య చర్యలు పటిష్టంగా పాటించడమే ఈ సమస్యకు మొదటి పరిష్కారమని వైద్యులు చెబుతున్నారు. ఇందుకోసం ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న డ్రైడే ఫ్రైడేగా చేయాల్సిందిగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే పలు వ్యాధులను నిరోధించుకోవచ్చనే విషయాన్ని ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది ప్రజలకు తెలుపుతున్నారు. ప్రతి గడపకు వెళ్లి ఇంటి ఆవరణలో ఉన్న నీటి నిల్వలు, మొక్కల కుండీల్లోని నీటిని తొలగింపజేసి ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నారు. పరిశుభ్రత విషయంలో ప్రజలను అప్రమత్తం చేసి తగు చర్యలు తీసుకోవడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చనే విషయాన్ని తెలియపరిచే కరపత్రాలను సైతం పంచుతున్నారు.

సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టండిలా...

వేసవి పోయి వర్షాకాలం రావడంతో వాతావరణం చల్లబడడమే కాకుండా మురుగునీరు నిల్వల కారణంగా కలుషిత వాతావరణంతో సీజనల్‌గా వచ్చే వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా చెత్తాచెదారాలను రోడ్డుపైనా, డ్రెయినేజీల్లోను పారవేయరాదని ప్రచారం చేస్తున్నారు. అంతేకాకుండా నిల్వ ఉన్న ఆహారాలు భుజించరాదని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, మూతలు వేయని ఆహారాన్ని తీసుకోవద్దని సూచిస్తున్నారు. తగ్గని చలి జ్వరం, కండరాల నొప్పులు, కంటి చూపులో ఇబ్బందులు వంటివి వస్తే సొంత వైద్యానికి స్వస్తి చెప్పి సమీపంలోని వైద్యులకు చూపించుకోవాలని వైద్యారోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు.

దోమ పుట్టుకను నివారించాలి

దోమల వ్యాప్తి నివారణలో భాగంగా కదలిక లేని నీటి నిల్వలపై దోమలు లార్వా విడిచిపెడతాయని ఆ లార్వా 8 నుంచి 10 రోజులలోపు గుడ్డుగా మారి తద్వారా దోమగా రూపాంతరం చెందుతుందని ప్రజలకు వివరిస్తున్నారు. ఈ క్రమంలో వారానికోరోజు ఇంటి పరిసరాల్లో డ్రైడేగా పాటించి అవసరం లేని నీటి నిల్వలతో పాటు దోమల నిలయాలుగా ఉండే సామాగ్రిని తొలగింపజేస్తే దోమలను అరికట్టవచ్చనేది డ్రైడే ఫ్రైడే ముఖ్య ఉద్దేశ్యం. దోమ పుట్టుకను నివారిస్తే వ్యాధులు దరిచేరవని వైద్యాధికారులు చెబుతున్నారు. దోమ కాటు ద్వారా మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధి వంటి ప్రమాదకరమైన వ్యాధులు సంక్రమిస్తాయి. ముఖ్యంగా దోమల వ్యాప్తిని నివారిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని పట్టణ, గ్రామాల్లోను అధికార యంత్రాంగం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడేగా నిర్ధారించి వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఇంటి పరిసరాల్లో ఉన్న చెత్త చెదారాలను తొలగింపజేయడంతో పాటు మొక్కల కుండీలు, రుబ్బురోళ్లు, రిఫ్రిజరేటర్లులో ఉన్న నీటి నిల్వలను తొలగింపచేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



తణుకులో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

తణుకు: ఆటో కార్మికులు తమ సమస్యలు పరిష్కారానికి సంఘటిత పోరాటాలకు సమాయత్తం కావాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు కోరారు. మంగళవారం తణుకు కొండాలమ్మ గుడి వద్ద జరిగిన యూనియన్ సమావేశంలో భీమారావు, తణుకు ఏరియా ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బొద్దాని నాగరాజు మాట్లాడుతూ ఆటో కార్మికులపై అధికారుల వేధింపులు విడనాడాలని వారి సంక్షేమానికి ప్రభుత్వాలు సహకరించాలని కోరారు. నూతన రవాణా చట్టాలు ఆటో కార్మికులకు గుదిబండలుగా మారాయన్నారు. ఆటో కార్మికులను ప్రభుత్వాలు అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తణుకు ఏరియా ఆటో వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కొంగరాపు బాలకృష్ణ, కోశాధికారి పేరిచర్ల రాంబాబు, అత్తిలి శ్రీను, ఆవాల వెంకటేష్, నందా కృపాదాస్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరిద్దాం.. ప్రాణాలు కాపాడుకుందాం



తణుకులో హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ సతీష్

తణుకు అర్బన్: రోడ్డు ప్రమాదాల్లో అధికశాతం తలకు గాయాలవలనే మృత్యువాత పడుతున్నారని వాటిని నివారించేందుకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తణుకు ట్రాఫిక్ ఎస్ఐ జానా సతీష్ అన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆదేశాల మేరకు హెల్మెట్ ధరించుదాం, ప్రాణాలు కాపాడుకుందాం నినాదంతో తణుకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు, ట్రాఫిక్ పోలీసు అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించిన వాహనదారులు ప్రాణనష్టం లేకుండా బయటపడుతున్నారని స్పష్టం చేశారు. హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేసి ప్రమాదాల్లో చాలా మంది చనిపోతున్నారని అన్నారు. వాహనదారులంతా ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాదులు కౌరు వెంకటేశ్వరరావు, కామన మునిస్వామి, ముప్పిడి సుబ్బయ్య, ఉండ్రాజవరపు రాజేంద్రకుమార్, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న హరికుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.హరికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. అసోసియేషన్ భవనంలో తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మంగళవారం హరికుమార్ మాట్లాడుతూ జూలై 2018 నుంచి రావాల్సిన డీఆర్ బకాయిలు, అడిషనల్ కోంటమ్ పునరుద్ధరణ, 12వ పీఆర్సీ నివేధిక రావడానికి ముందుగా 30 శాతం ఇంటిరీయర్ రిలీఫ్ చెల్లిస్తామని చెప్పారని, చెల్లింపులు జరగకపోవడం శోచనీయమన్నారు. అదే విధంగా ఇన్‌కంటాక్స్ రిటర్న్ దాఖలు చేసుకొనని సభ్యులు ఇంకా ఎవరైనా ఉంటే ఈ నెల 31వ తేదీ లోపు దాఖలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కార్యదర్శి సత్యనారాయణ మూర్తి, కె.బాలకృష్ణ, కె.సూర్రెడ్డి, పి.జయరాజు, గరికపాటి సుబ్రహ్మణ్య శర్మ, కృష్ణ కుమారి, సరోజని, ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

తణుకులో 21 నుంచి సీపీఎం జిల్లా స్థాయి సమావేశాలు



తణుకులో మాట్లాడుతున్న చింతకాయల బాబూరావు

తణుకు: ఈనెల 21, 22, 23 తేదీల్లో తణుకులో జరిగే సీపీఎం జిల్లా స్థాయి సమావేశాలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, పీవీ ప్రతాప్‌లు విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక అమర వీరుల భవనంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి బళ్ల చినవీరభద్రం అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో బాబూరావు, ప్రతాప్‌లు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి మూడు రోజుల పాటు సమావేశాలు జరుగుతాయన్నారు. జిల్లాలో ప్రజలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి 20 మంది ప్రతినిధులు వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గార రంగారావు, గణేష్, గోపి, వి.ధనసత్యనారాయణ, ఎస్.కరుణకుమార్, ఎస్.ఏసు, అంబటి రామకృష్ణ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఉండి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ డి.బెన్నీ సామ్యూల్ అన్నారు. మంగళవారం డెంగీ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బెన్నీ సామ్యూల్ మాట్లాడుతూ డెంగీ దోమల ద్వారా వస్తుందన్నారు. మన పరిసరాల్లో దోమలు పెరిగేందుకు అనుకూలత లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రతీ శుక్రవారం డ్రైడేను బాధ్యతగా నిర్వహించాలన్నారు. యాంటీ లార్వల్ ఆపరేషన్స్ ద్వారా స్ప్రేయింగ్ చేయాలని ఇప్పటికే పీహెచ్‌సీ పరిధిలో గ్రామాల్లోనూ దోమల నివారణ మందులు సరఫరా చేశామన్నారు. పీహెచ్‌సీ సిబ్బంది జ్వరాల సర్వే తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు.

సంప్రదాయ కళలను కాపాడుకోవాలి



హరికథ కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: భారతీయ సంస్కృతి సంప్రదాయాల్లో భాగమైన కళల్లో హరికథ ముఖ్యమైందని, అలాంటి మన కళను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని రసధుని అధ్యక్షుడు కొట్టి భాస్కరరావు అన్నారు. సోమవారం రాత్రి స్థానిక క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో తూర్పుగోదావరి జిల్లా అంబాజీపేటకు చెందిన నేమాని వెంకట నాగలక్ష్మి భాగవతారణి భక్తరామదాసు హరికథను నిర్వహించగా రసధుని సాహితీ సంస్థ సభ్యులు కార్యక్రమంలో భాగంగా ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భాగవతారిణి మాట్లాడుతూ హరికథ వివరాలను సాహితీప్రియులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రసధుని సభ్యులు యర్రంశెట్టి వెంకటరత్నం, మామిడిశెట్టి శ్రీనివాస్, పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ, వంగా నరసింహరావు, ముచ్చర్ల శ్రీనివాసరావు, బొండాడ మోహనగుప్త, కొల్లి నరసింహమూర్తి, వి.హరికృష్ణ పాల్గొన్నారు.

భారీగా అన్న సమారాధన

తాడేపల్లిగూడెం (టీఓసీ): వారాహి అమ్మవారి చల్లని చూపు ప్రజలపై ఉండాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని వాసపల్లి గూడెంలో వారాహి అమ్మవారిని ఎమ్మెల్యే శ్రీనివాస్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అన్న క్యాంటీన్ నిర్వహణలో తనకు అవకాశం ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక తాలూకా ఆఫీస్ సెంటర్‌లో మంగళవారం గతంలో నిర్వహించిన అన్న క్యాంటీన్ వద్ద అన్నసమారాధన కార్యక్రమం జరిగింది.

కేంద్ర మాజీ మంత్రి బులిరామయ్య జయంతి

తణుకు: ప్రముఖ పారిశ్రామికవేత్త మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ బోళ్ల బులిరామయ్య జయంతి వేడుకలు మంగళవారం తణుకులో ఘనంగా నిర్వహించారు. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తణుకును ప్రపంచపటంలో ఒక గుర్తింపు తెచ్చిన రాకెట్ ఇంధనం తయారీలో బులిరామయ్య వెన్నుముకగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

తణుకు అర్బన్: ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తణుకు ఆర్టీసీ డిపో మేనేజరు సప్పా గిరిధర్ కుమార్ తెలిపారు. తణుకు డిపో నుంచి ప్రయాణించే ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, స్లీపర్ సర్వీసులకు సంబంధించి ప్రయాణికులు తమ విలువైన సూచనలు, ఫిర్యాదులను 99592 25484 నంబరులో తెలపాల్సిందిగా కోరారు. ప్రయాణికులు తెలిపిన సూచనలు, ఫిర్యాదులను పరిష్కరించి మరింత మెరుగైన సేవలను అందజేస్తామని వివరించారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ ఆర్టీసీ డిపో కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుందని డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి వెల్లడించారు. డిపో ఆధ్వర్యంలో అందజేస్తున్న బస్సు సరీ్వసులు, కార్గో, యాత్ర ప్రత్యేక బస్సులు, బస్సు పాసులు ఇతర సర్వీస్‌లపై విలువైన సూచనలు, సలహాలు, ఫిర్యాదులను 99592 25488 నంబరులో తెలిపాల్సిందిగా కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని హౌసింగ్ బోర్డు పరిధిలో ఈ నెల 10వ తేదీ బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రిలయన్స్ ఫీడర్ మరమ్మతులు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. హౌసింగ్‌బోర్డు, గాంధీబొమ్మ సెంటర్, గణేష్‌నగర్, వానపల్లిగూడెం, మామిడితోట, వీకర్స్‌కాలనీ, ఇందిరానగర్, ఏరియా ఆస్పత్రి ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.


నేడు ఆల్ ఇండియా డిమాండ్స్ డే

తాడేపల్లిగూడెం (టీఓసీ): బీజేపీ ప్రభుత్వానకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులు, ఉద్యోగులు ఈ నెల 10వ తేదీ బుధవారం ఆల్ ఇండియా డిమాండ్స్ డే ను నిర్వహిస్తున్నారని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు జిల్లా నాయకులు చింతకాయల బాబూరావు, చిర్ల పుల్లారెడ్డిలు వెల్లడించారు. మంగళవారం బాబూరావు మాట్లాడుతూ దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తుందని, కార్మిక రైతాంగానికి వ్యతిరేకంగా దాడులు సాగిస్తున్నారని విమర్శించారు. రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరారు.

11న అలంపురం ట్రస్టు ఆస్పత్రిలో ఉచిత సేవలు

పెంటపాడు: ఈనెల 11న అలంపురం వెంకటరమణసేవా ట్రస్టు ఆస్పత్రిలో ఉచిత వైద్యసేవలు నిర్వహిస్తున్నట్లు కొలనువాడ పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రి జీఎస్ఎల్ ఆస్పత్రికి చెందిన జనరల్‌వైద్యులు, అంకాలజీ, గైనకాలజీ, కార్డియాలజీ, చిన్నపిల్లల వ్యాధుల నిపుణులు వచ్చి వైద్యపరీక్షలు చేస్తారన్నారు. దీంతో పాటు, గుండె పరీక్షలకు సంబంధించి ఈసీజీ, 2డీ ఈకో పరీక్షలు ఆల్ట్రా స్కానింగ్ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. ఈ శిబిరాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రైతులకు లాభసాటిగా పాడి పరిశ్రమ



రైతులకు యాంటీ బయోటిక్ పౌడర్‌ను అందజేస్తున్న ఎంపీపీ కరారి జయలక్ష్మి, తదితరులు

ఆకివీడు: పాడి పరిశ్రమ అభివృద్ధి చెందితేనే రైతులకు లాభసాటిగా ఉంటుందని ఎంపీపీ కరారి జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు పాతపాటి శ్రీనివాసరాజు చెప్పారు. మండలంలోని పెదకాపవరంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మూగ జీవుల వేదనను రైతులు గుర్తించి సకాలంలో వైద్యం చేయించాలన్నారు. అధిక పాల దిగుబడి, సూడి కట్టడం వంటి వాటి ద్వారా రైతు ఆర్థిక పరిపుష్టిని సాధిస్తాడని చెప్పారు. పశు సంవర్థక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ జవహర్ హుస్సేన్ మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు. పశువులకు సంబంధించిన గర్భ కోశ వ్యాధుల నివారణకు సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆవులకు వచ్చే లింపీ వ్యాధి నివారణకు ముందు జాగ్రత్తగా వ్యాక్సిన్‌లు వేయించాలని సూచించారు. పశు గణాభివృద్ధి కార్య నిర్వాహణాధికారి జేసురత్నం మాట్లాడుతూ పశువులకు వ్యాధులు సంక్రమించకుండా ముందు జాగ్రత్త చర్యలుగా వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి డాక్టర్ కెల్లా భార్గవీసత్య, వర ప్రసాద్, హేమ, చంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



పెంటపాడులో ఫిజియోథెరపీ పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీనివాస్

పెంటపాడు: మండలంలోని భవిత కేంద్రం ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం జరుగుతున్న ఉచిత ఫిజియోథెరపీ సేవలను దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో ఎం. శ్రీనివాస్ కోరారు. పెంటపాడు ప్రభుత్వ బేసిక్ పాఠశాలలో భవితకేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు డాక్టర్ అల్లు మహేష్ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం ఫిజియోథెరపీ సేవలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాన్ని ఎంఈవో పరిశీలించారు. ఇక్కడ ప్రతి మంగళవారం జరుగుతున్న సేవలపై ఐఈడీ ఉపాధ్యాయిని షేక్ మస్తాన్ బీ ని ఆరాతీసారు. కాగా ప్రతీ మంగళవారం భవిత కేంద్రంలో విద్యార్థులకు విద్యతో పాటు, మాటలు రానివారికి మాటలు నేర్పించడం, కాళ్లు, చేతులు పనిచేయని వారిని గుర్తించి వారికి వైద్యసేవలు అందజేయడం జరుగుతోందన్నారు. వీరికి పలు రకాల ఆలవెన్సులు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని సునీత, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ



తణుకులో దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న మానవత సభ్యులు

తణుకు టౌన్: మానవత సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. కేంద్రమాజీ మంత్రి బోళ్ల బులిరామయ్య 98వ జయంతిని మంగళవారం తణుకు రోటరీ క్లబ్, మానవత, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తణుకు మానవత సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మానవత సంస్థ జిల్లా శాంతిర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, మండల కన్వీనర్ బోయపాటి రామలక్ష్మీ, కన్వీనర్ ఎస్వీ సతీష్ బాబు, కార్యదర్శి బీ రామకాశి, కోశాధికారి ఏ కాశీ, డాక్టర్ రామలక్ష్మి, కె భారతి, మల్లిన అరుణ సారథి, ఆలపాటి సోమేశ్వరరావు, వంగూరి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: పద్మశాలి ఎంప్లాయిస్ అండ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం భీమవరంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కట్టా లక్ష్మణస్వామి, దివి కుమారస్వామి, కోశాధికారిగా ఆకురాతి సూర్యనారాయణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా తుమ్మ బాలకృష్ణ, గుల్లంగి సాయి ప్రసాద్, చింతలపూడి వెంకట సుబ్బారావు, తమ్మిశెట్టి సత్యనారాయణ, ఎం.వెంకట ప్రసాద్, హనుమంతరావు సహాయ కార్యదర్శులుగా బందారు వెంకట కృష్ణ, కొక్కిరాల బాలాజీ సుబ్రహ్మణ్యం, తుమ్మ వీర వెంకట కృష్ణమూర్తి, ఆకురాతి కృష్ణమోహన్, ఉయ్యూరి శ్రీరాములు, గిడుతూరి వెంకట శివకుమార్ కార్యవర్గ సభ్యులుగా కాదూరి నాగరాజు, దార్న కనకదుర్గ, బత్తుల బుదజ్ఞమణి, గిడుతూరి మధులత ఎన్నికయ్యారు. మహిళా విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఆకురాతి పుష్పావతి, బీజేవీడీ రాజ్యలక్ష్మి, కోశాధికారిగా నేమాల బాలకృష్ణవేణి, రాష్ట్ర ప్రతినిధులుగా కానూరు నర్సమాంబ, డాక్టర్ వి.శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జీవీఎస్ రామకృష్ణ, నీలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



గర్భిణులకు పండ్లు పంపిణీ చేస్తున్న దాత సురేష్

కాళ్ల: ప్రభుత్వ ఆస్పత్రిలో మౌలిక వసతుల ఏర్పాటుకు దాతల సహకారం అభినందనీయమని వైద్యులు సరాబు సునీల్ తెలిపారు. ఆస్పత్రిలో అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుకు కాళ్లకురు గ్రామానికి చెందిన వీరమల్లు సురేష్ ముందుకు వచ్చారు. ఆసుపత్రిలో అవసరమయ్యే రెండు బెడ్స్, ఆరు ఫ్యాన్లు, రెండు బెంచీలను సుమారు రూ.40 వేలతో సమకూర్చారు. వీటిని వైద్యులు సరాబు సునీల్ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. అదే విధంగా ప్రతి నెల 9న నిర్వహించే పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్ ఆధ్వర్యంలో 54 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులకు దాత వీరమల్లు సురేష్ ధాతృత్వంతో భోజనాలు ఏర్పాటు చేసి, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వైద్యధికారి డాక్టర్ సరాబు సునీల్, సిబ్బంది దాత వీరమల్లు సురేష్‌ని సత్కరించి, మెమెంటో అందజేశారు. దాత సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో వసతుల ఏర్పాటుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ డి.సునీత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.